## 20. తిరుపతి వేంకట కవులు

చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి గారు, దివాకర్ల తిరుపతి శాస్త్రి గారు తిరుపతి వేంకట కవులుగా, జంటకవులుగా ప్రసిద్ధి చెందారు.

చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి గారు శ్రీ కామయ్య, శ్రీమతి చంద్రమ్మ దంపతులకు 8.8 .1975 సంవత్సరంలో తూర్పుగోదావరి జిల్లాలోని కడియం లో జన్మించారు. వీరిది పండిత వంశం. దివాకర్ల తిరుపతి శాస్త్రి గారు శ్రీ వేంకటావధాని, శ్రీమతి శేషమ్మ దంపతులకు పశ్చిమగోదావరి జిల్లా జిల్లీసీమ లో ఎండగండిలో జన్మించారు. వీరిది పండిత వంశం.తిరుపతి శాస్త్రి తాత గారు సాంగవేదాధ్యయనం చేసారు.

చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి, దివాకర్ల తిరుపతి శాస్త్రిగార్లు 19 శతాబ్దంలో జీవించినంతకాలం ఆంధ్ర సారస్వత రంగంలో మకుటం లేని మహారాజులుగా, జంట కవులుగా పేరు పొందారు. వీరిద్దరూ ఐనచర్ల బ్రహ్మయ్య శాస్త్రి వద్ద శిష్యరికం చేసి, వ్యాకరణ శాస్త్రంలో సహాధ్యాయులై భాష్యాంతాన్ని పఠించారు.

ఆంధ్రాకు స్వస్థాన వేష భాషాభిమానం కల్పించిన మహనీయుల్లో తిరుపతి వెంకట కవులు పేర్కొనదగినవారు. ఈ జంట కవులు అష్టావధాన, శతావధానాల్లో ప్రావీణ్యులు. శ్రీనాథుడు మొదలైన కవుల వలె వీరు కూడా రాజాస్థానాలలో నిరాఘాటంగా పండితులతో విద్యా వివాదాలతో ఢీకొని జయ పత్రికలు పొందేవారు. వీరి చాటువులు, ఛలోక్తులు ప్రజల నాలుకలపై నిలిచి బహుళ ప్రచారం పొంది, ఆంధ్ర సాహిత్యంపై అభిరుచిని, ఆదరాన్ని, ప్రీతిని కలిగించాయి. తిరుపతి శాస్త్రి కాకినాడలో పండిత ప్రభువైన పోలవరం జమీందారు వద్ద 1900 లో ఆస్థాన కవిగా నిలిచారు. వేంకటశాస్త్రి 1902లో బందరు హిందూ హై స్కూల్ లో ఆంధ్ర అధ్యాపకులుగా ప్రవేశించారు.

ఈ జంట కవులు బుద్ధ చరిత్ర కావ్యాలు రాశారు. భారత కథను నాటకాలుగా రాశారు. ఆంధ్రదేశంలో మొదటి నుండి జంట కవిత్వాలు ఉన్నప్పటికీ వీరి మధ్య ఉన్న విడదీయరాని స్నేహబంధం , వీరి కావ్య శైలి మరెక్కడా కనిపించవు. 1920లో తిరుపతి శాస్త్రి స్వర్గస్తులైన తర్వాత 30 సంవత్సరాలు జీవించి

ఉన్న వెంకటశాస్త్రి తను రాసిన రచనలు అన్నింటికీ తిరుపతి వెంకటీయంగానే ప్రచురించడం చూడవచ్చు.

వెంకట శాస్త్రి 60 సంవత్సరాలుగా కవితా రాజ్యాన్ని పాలించి ఆంధ్ర విశ్వకళా పరిషత్ నుండి కళాప్రపూర్ణ బిరుదు పొంది, మద్రాసు ప్రభుత్వంతో ప్రథమాంధ్ర ఆస్థాన కవిగా అభిషిక్తులై, గౌరవం అందుకొని 1950 మార్చిలో శివ సాయుజ్యాన్నిపొందారు.

**పాండవోద్యోగం:**

ఈ నాటకం ఆరు అంకాలతో ఉంటుంది. ఇందులోని ప్రధాన ఇతివృత్తం అభిమన్యుని వివాహం తర్వాత నుండి, మొదటి రోజు జరిగే యుద్ధం ప్రారంభమయ్యే వరకు ఉన్న కథ. ఈ కథ భారతంలో ఉద్యోగ పర్వంలోనిది.

యుద్ధం తప్పదని భావించిన కురుపాండవులు కృష్ణుడు సహాయం కోరడం, కృష్ణుడు ఇద్దరికీ సహాయం చేస్తానని చెప్పడం, కృష్ణుడు తాను యుద్ధం చేయనని, తాను ఒక వైపు మిగిలిన సైన్యం అంతా ఒక వైపు అని చెప్తాడు. అర్జునుడిని

ముందుగా కోరుకోమనగా అర్జునుడు కృష్ణుని కోరుకొంటాడు. దుర్యోధనుడు సైన్యాన్ని కోరుకుని  సెలవు తీసుకుంటాడు.

దీనిలో ముఖ్యంగా కృష్ణ రాయబారం, కృష్ణార్జునులు యుద్ధ రంగ ప్రవేశం, కృష్ణుడు అర్జునుడికి హితబోధ చేయడం మొదలైన అంశాలు ఉంటాయి.

**పాండవ జననం:**

ఈ నాటకంలో పరాశరమహర్షి ప్రవేశంతో ప్రథమాంకం ప్రారంభమవుతుంది. సత్యవతికి పుత్రుడు జన్మించడం, శంతనుడు మత్స్యగంధిని ఇష్టపడడం, గాంగేయుడు దాశరాజు వద్దకు వెళ్లి తాను రాజ్యాన్ని కోరనని, వివాహం కూడా చేసుకోనని భీష్మ ప్రతిజ్ఞ చేసి దాసరాజునొప్పించి, తండ్రి వివాహం జరిపించడం ఇందులోని అంశాలు.

కుంతి మాద్రిలు దేవతల వరప్రభావంతో కుమారులను పొందడం మొదలైన అంశాలు ఈ నాటకంలో ఉంటాయి.